సాక్షి
ప్రకాశం
మంగళవారం। 10। సెప్టెంబర్। 2024



వినాయకచవితి మండపం వద్ద అపశ్రుతి
వినాయక మండపానికి కట్టిన తాడు తగిలి బైక్ ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. - 8లో..



గ్యాస్ సిలిండర్ పేలి రూ.2 లక్షల ఆస్తినష్టం
ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
32.4/27
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి త్రోబాల్ క్రీడలకు క్రీడాకారుల ఎంపిక రేపే

దర్శి: మండలంలోని చందలూరు పాఠశాలలో జిల్లా స్థాయి త్రోబాల్ జూనియర్ బాలబాలి కల క్రీడల ఎంపిక బుధవారం చందలూరు పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎం నరసింహారావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. చంద లూరు పాఠశాలలో మధ్యాహ్నం రెండు గం టల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుంద న్నారు. జనవరి 2006 తరువాత జన్మించిన వారు ఈ క్రీడా పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పీడీ అంజిరెడ్డి వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 9985357903 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు వెల్ఫేర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

ఒంగోలు సెంట్రల్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్స్‌కు మంగళవారం ఒంగోలు డ్వామా కార్యాలయంలో బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మా నాయక్ తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 312 మంది వెల్ఫేర్ అసిస్టెంట్స్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వెల్ఫేర్ అసిస్టెంట్స్ సకాలంలో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

మూడు గ్రామాల సచివాలయాలకు జీతాలు కట్!

- సచివాలయ సిబ్బందిపై ఈఓఆర్డీ కక్షపూరిత చర్యలు




ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

పీసీపల్లి: సచివాలయ సిబ్బందిపై బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని పెదయిర్లపాడు, వెంగళాయపల్లి, లక్ష్మక్కపల్లి సచివాలయాల సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు రాక అల్లాడుతున్నారు. సచివాలయాలకు ప్రతి నెలా 20వ తేదీ జీతాల బిల్లులు పంపకుండా ఈఓఆర్డీ మల్లేశ్వరి వేధిస్తోందని సిబ్బంది వాపోతున్నారు. కింది స్థాయి సిబ్బందిపై విధుల విషయంలోనూ ఈఓఆర్డీ వేధిస్తోందని సిబ్బంది ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతి పత్రం అందించారు. ప్రభుత్వ లక్ష్యాలు, పథకాలు ప్రజలకు మరింత చేరువలో అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బందిపై ఇలా కర్కశంగా వ్యవహరించడం బాధాకరంగా ఉందని మహిళా ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోతే తామెలా బతకాలని ఉద్యోగస్తులు ఎంపీడీఓకు అందించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై ఈవోఆర్డీ మల్లేశ్వరిని వివరణ కోరగా సిబ్బంది కొరతతో అన్నీ తానే చూసుకుంటున్నానని, మూడు పంచాయతీల సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమయపాలన పాటించడం లేదని, విధుల్లో సహకరించకపోవడంతో జీతాలు ఆలస్యమయ్యాయని చెప్పారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది జీతాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈవోఆర్డీ మల్లేశ్వరిపై విచారణకు ఆదేశించానన్నారు. మూడు సచివాలయాల సిబ్బందికి త్వరలో జీతాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

మెడికలేనా?

- వైద్య విద్యపై కూటమి కుట్ర..

మార్కాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేదలకు వైద్యవిద్యను అందుబాటులోకి తీసుకు రావడంతోపాటు, పశ్చిమ ప్రకాశం వాసులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందించే దిశగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబు సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాలతో ఈ కళాశాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభించే దిశగా గత ప్రభుత్వం అడుగులు వేస్తే..చంద్రబాబు నిర్ణయం ఫలితంగా ఈ ఏడాది 150 సీట్లు కోల్పోయాం. గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని పాడేరుకు అనుమతి ఇచ్చి ఎక్కువ గిరిజన ప్రాంతాలు ఉండే ఈ మెడికల్ కళాశాలకు అనుమతి ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. దీంతో ఈ కళాశాల ప్రారంభమే ప్రశ్నార్థకంగా మారింది.



- మార్కాపురం మెడికల్ కళాశాలపై నీలినీడలు
- పాడేరుకు అనుమతిచ్చి, మార్కాపురాన్ని విస్మరించిన ప్రభుత్వం
- పశ్చిమంలో 75కు పైగా గిరిజన గూడేలు
- కొత్తగా డాక్టర్ల నియామకం బంద్
- మొక్కుబడిగా సాగుతున్న పనులు
- వైఎస్సార్ సీపీ హయాంలో 75 శాతం పనులు పూర్తి
- పీపీపీ విధానంపై ఆగ్రహం



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ

మార్కాపురం:

మార్కాపురాన్ని జిల్లా చేస్తాం.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామంటూ చంద్రబాబు నాయుడు ఎన్నికల సభల్లో హామీ ఇచ్చారు. జిల్లాను చేయడం మాట అటుంచితే ఈ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలతో పాటు వైద్య విద్య దూరం అయ్యేలా ఉన్నాయి కూటమి ప్రభుత్వ చర్యలు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ ఏడాది నుంచే ప్రారంభం కావాల్సిన ఎంబీబీఎస్ అడ్మిషన్లు వాయిదా పడ్డాయి. మార్కాపురంలో మెడికల్ కళాశాల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.475 కోట్లు మంజూరు చేశారు. రాయవరం గ్రామం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు చేపట్టారు. రెండేళ్లగా పనులు వేగంగా జరిగాయి. దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందులో సిబ్బంది క్వార్టర్స్, నర్సింగ్ కళాశాల, జంట్స్, లేడీస్ హాస్టల్స్, క్లాసు రూములు, సెంట్రల్ క్యాంటీన్ పూర్తయ్యాయి. కళాశాలలో విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ పనులు, రంగులతోపాటు కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తిచేయాల్సి ఉంది. అలాగే 82 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, డాక్టర్లను గత ప్రభుత్వం నియమించింది. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. జీజీహెచ్‌లో 450 బెడ్లను సిద్ధం చేసింది. జనరల్ మెడిసిన్ కోసం 100, ఆప్తమాలజీ 20, డెర్మటాలజీ 10, సైకియాట్రీ విభాగం 10, జనరల్ సర్జరీల కోసం 100, ఆర్థోపెడిక్ విభాగానికి 40, ఈఎన్‌టీకి 20, ఐసీయూ బెడ్లు 20, పీడియాట్రిక్స్ 50, ఓబీజీ (ప్రసూతి గైన కాలజీకి) 50 బెడ్లను కేటాయించింది. ఈ ఏడాది ఎలాగైనా ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ సర్కార్ అన్ని రకాల చర్యలు తీసుకుంది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితి తారుమారైంది. మెడికల్ కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనులు మందగించాయి. ప్రైవేటుపై మోజుతో ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గుజరాత్ పీపీపీ మోడల్ పేరిట ప్రభుత్వ వైద్యకళాశాలు ప్రైవేటుకు కట్టబెట్టేందుకు చర్యలు చేపట్టింది.

జూన్‌లో ఎన్ఎంసీ బృందం పరిశీలన:

ఈ ఏడాది జూన్ 24వ తేదీన నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం మెడికల్ కాలేజీని, జీజీహెచ్‌ను పరిశీలించింది. ఈ బృందంలో ఢిల్లీ నుంచి ఎన్ఎంసీ ఛైర్‌పర్సన్ డాక్టర్ బీవా బోరువా (అస్సాం), డాక్టర్ సంజీర్‌కుమార్ భట్ (లక్నో), డాక్టర్ సతీష్ చవాన్ (హుబ్లీ)లతో పాటు స్థానిక ప్రిన్సిపల్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎస్‌వీవీ నాగరాజమన్నార్, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీ సావిత్రితో కలిసి పరిశీలించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఇటీవల ఎన్ఎంసీ అధికారులు నూతన ప్రతిపాదనలు పంపాలని చెప్పడంతో జీజీహెచ్ అధికారులు హడావుడిగా కేంద్రానికి నివేదిక పంపారు. వర్చువల్ విధానంలో జీజీహెచ్‌ను పరిశీలించారు. 450 బెడ్లు ఉన్నాయనీ, 82 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న బెడ్లు సరిపోతాయని, 132 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా 82 మందే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించి అదనంగా 50 మంది డాక్టర్లను ఇక్కడకు పంపి ఉంటే కొత్త విద్యా సంత్సరంలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభమయ్యేవి. ప్రస్తుతం నీట్ కౌన్సెలింగ్ కూడా ప్రారంభమైపోయింది. అందులో మార్కాపురం కళాశాల పేరులేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఉసూరుమన్నారు.



మెడికల్ కాలేజీలో పూర్తికావచ్చిన హాస్టల్ బ్లాక్

మందకొడిగా పనులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్కాపురం మెడికల్ కళాశాల పనులు దాదాపుగా ఆగిపోయాయనే చెప్పాలి. రెండేళ్లగా చురుగ్గా సాగిన పనులు ఒక్కసారిగా మందగించాయి. చిన్నాచితకా పనులు మాత్రమే జరుగుతున్నాయి. మెడికల్ కళాశాల వద్ద సెక్యూరిటీ తప్ప పనులు జరుగుతున్న దాఖలాలు కనిపించడంలేదు. వచ్చే విద్యా సంవత్సరానికైనా పనులు పూర్తవుతాయా అన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పీపీపీ విధానంలో పనులు చేపడితే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమైనట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమంపై సీతకన్నే..


పశ్చిమ ప్రకాశంలోని సుమారు 8 లక్షల మంది ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతులు మంజూరు చేశారు. అంతేకాకుండా రూ.475 కోట్లు విడుదల చేశారు. పనులు సైతం వేగంగా జరిగాయి. కూటమి ప్రభుత్వం ఈ మెడికల్ కళాశాలపై సవతి తల్లిప్రేమ చూపిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాడేరు గిరిజన ప్రాంతం కావడంతో అక్కడ వైద్యసేవలు అందాలనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలతోపాటు అడ్మిషన్లకు అనుమతి ఇచ్చింది. అయితే పశ్చిమ ప్రకాశంలోని పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, అర్థవీడు, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల్లో సుమారు 72 చెంచుగూడేలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతంలో చిన్నారుట్ల, పెద్దారుట్ల, పనుకుమడుగు, బందంబావి, పాలుట్ల, అక్కచెరువుతాండ, బోడేనాయక్ తాండ, వై చెర్లోపల్లి, నల్లగుంట్ల, వెంకటాద్రిపాలెం, కలనూతల, గుండంచర్ల, అక్కపాలెం, మర్రిపాలెం, గన్నెపల్లి, వెలగలపాయ, బొల్లుపల్లి, మాగుటూరు తాండ, వెల్లుపల్లి, జేపీ చెరువు, మాగుటూరు తాండ, గొట్టిపడియ తదితర ప్రాంతాలన్నీ చెంచుగిరిజన ప్రాంతాలు. ఇక్కడ వేలాది మంది గిరిజనులు నివాసముంటున్నారు. మరి మార్కాపురాన్ని ఎందుకు విస్మరించారో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి.

మెడికల్ కాలేజీ త్వరగా పూర్తిచేయాలి



మార్కాపురం మండలం రాయవరం దగ్గర నిర్మిస్తున్న మెడికల్ కాలేజీని త్వరగా పూర్తి చేయాలి. ఈ ఏడాదే అడ్మిషన్లు ప్రారంభించాలి. దీనివలన 100 మెడికల్ సీట్లు మంజూరైతే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య అందుబాటులోనికి వస్తుంది. దీంతోపాటు జీజీహెచ్‌లో కూడా రోగులకు మెరుగైన సేవలు లభిస్తాయి. ప్రభుత్వమే మెడికల్ కాలేజీని నిర్వహించాలి. జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ సర్వీసెస్ న్యూరాలజీ, కార్డియాలజీ సేవలు కూడా అందుబాటులోనికి తేవాలి.

– పత్తి రవిచంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి



శశితో విఘ్నపతి

ఒంగోలు రాజాపానగల్ రోడ్డులో నెలవంకతో బాలగణపతి ప్రతిమ

హరిత గణపతి

టంగుటూరు చెల్లెమ్మ తోటలో ప్రకృతి ఒడిలో ఉన్నట్లు తీర్చిదిద్దిన హరిత గణపతి



కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: తన కుమారుడికి కలెక్టరేట్లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ కృష్ణా జిల్లా చందర్లపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మోసం చేశాడని ఒంగోలుకు చెందిన మహిళ ఒకరు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదు చేశారు. మాయమాటలతో నమ్మించిన సదరు వ్యక్తి తన వద్ద నుంచి రూ.1.50 లక్షలు తీసుకున్నాడని, ఉద్యోగం రాకపోవడంతో తన దగ్గర నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుంటే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే తనవద్ద ఉన్న ఆర్థోపెడిక్ స్కానింగ్ మిషన్‌ను తీసుకెళ్లిన నెల్లూరుకు చెందిన వ్యక్తి అద్దె చెల్లించకుండా వేధిస్తున్నాడని మెడికల్ ఆఫీసర్ ఒకరు ఫిర్యాదు చేశారు. నెలకు రూ.10 వేల చొప్పున చెల్లించేలా అగ్రిమెంటు చేసుకొన్న సదరు వ్యక్తి తొలుత సక్రమంగానే అద్దె చెల్లించాడని, ఆ తరువాత సంవత్సరం నుంచి అద్దె చెల్లించకుండా మోసం చేస్తున్నాడని వాపోయారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 68 ఫిర్యాదులు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్ వీ శ్రీధర్ రావు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. చట్టప్రకారం విచారణ జరిపి సత్వర న్యాయం చేకూరుస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తాలుకా సీఐ అజయ్ కుమార్, ప్యానల్ అడ్వొకేట్ బీవీ శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కారవేదిక ఎస్ఐలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

డీలర్ షిప్‌ల కోసం రేషన్ నాటకం!

- డీలర్ రాజీనామా చేయాలని లేకుంటే దొంగ కేసులు పెట్టిస్తామని అధికార పార్టీ నేతల బెదిరింపులు

కురిచేడు: పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని అక్రమార్కులు యథేచ్ఛగా పక్కదారి పట్టిస్తున్నారు. వాటిని సక్రమ మార్గంలో పేదలకు అందేలా చేయాల్సిన రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు నిద్రావస్థ నటిస్తున్నారు. బియ్యం మాఫియా నిర్విఘ్నంగా బస్తాల లేబిళ్లను కూడా మార్చకుండా అక్రమ మార్గంలో మిల్లులకు చేరవేస్తోంది. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించడమే కాకుండా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ఉన్న డీలర్ల డీలర్‌షిప్ వదులుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేయిస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. సోమవారం త్రిపురాంతకానికి చెందిన టీడీపీ నాయకుడు ఇమ్మడిశెట్టి సుబ్బారావు రేషన్‌బియ్యం 30 క్వింటాళ్లు కొనుగోలు చేసి పల్నాడు జిల్లా నాగిరెడ్డిపల్లెకు ఏపీ39యూఎల్4460 నంబరున్న బొలెరో వాహనంలో తరలిస్తున్నాడు. అధికార పార్టీ కార్యకర్తలు ఆ వాహనాన్ని మండలంలోని కల్లూరు గుట్టమీదపల్లె వద్ద ఆపారు. దానిని తీసుకొచ్చి కురిచేడులోని దర్శిరోడ్డు పెట్రోలు బంకు వద్ద టిప్పర్ల చాటున ఉంచారు. అక్కడ నుంచి ముష్టగంగవరానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు కురిచేడు మండలం కల్లూరు డీలరుకు ఫోన్ చేసి నువ్వు రాజీనామా చేయాలని, లేకుంటే ఈ బియ్యం నీ రేషన్ షాపు నుంచే వచ్చాయని కేసు నమోదు చేయిస్తామని బెదిరింపులకు దిగారు. ఈ విషయం మీడియాకు తెలిసి ఆ వాహనాన్ని ఫొటోలు తీసి, రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం చేరవేశారు. తహసీల్దార్ జీ రజనీకుమారి వీఆర్వోను, వీఆర్ఏను పంపించారు. ఈ విషయం పెద్దది కాకముందే అక్కడ నుంచి తప్పించుకోవాలని అందరి కళ్లుకప్పి వాహనం డ్రైవరు వాహనాన్ని తీసుకుని నాగిరెడ్డిపల్లె మిల్లుకు తరలించాడు. అధికారపార్టీ నాయకులు లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లించి అక్రమ వ్యాపారం చేయటమే కాకుండా రాజీనామా చేయకపోతే దొంగ కేసులు బనాయిస్తామని డీలర్లపై బెదిరింపులకు దిగుతున్నారు.



వాహనంలో ఉన్న రేషన్ బియ్యం



రేషన్ బియ్యం గోతాలపై ఉన్న ప్రభుత్వ ముద్ర



రేషన్ బియ్యంతో వెళుతున్న బొలెరో వాహనం

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.358 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో 10,202 బేళ్లు వేలానికి రాగా 8,725 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,477 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 151వ రోజు నిర్వహించిన వేలంలో 5,456 బేళ్లు వేలానికి రాగా, 4,946 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 510 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి రూ.309.92 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 145వ రోజు నిర్వహించిన వేలానికి 4,746 బేళ్లు రాగా, 3,779 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 967 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.180, సరాసరి ధర రూ.271.70 పలికింది.


పీసీ పల్లి : కోలాహలంగా సాగుతున్న గణనాథుని నిమజ్జన ఊరేగింపు


కొనకనమిట్ల : గొట్లగట్టులో గణేష్ ఉత్సవం


గిద్దలూరు రూరల్ : రాజానగర్‌లో సందడి చేస్తున్న యువకులు, చిన్నారులు

వెళ్లిరావయ్యా గణపయ్యా..!

గణనాథుడికి నిమజ్జనోత్సవాలు షురూ అయ్యాయి. వినాయకచవితి సందర్భంగా జిల్లావ్యాప్తంగా వాడవాడలా గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం మూడో రోజు కావడంతో పలు ప్రాంతాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ముందుగా కోలాహలంగా ఊరేగించి పూజలు చేశారు. ఊరేగింపులో యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. డీజేలు, డప్పులకు నృత్యం చేసి ఆకట్టుకుని భక్తిభావాన్ని చాటుకున్నారు.

– సాక్షి, ఒంగోలు


బేస్తవారిపేట : పూసలపాడులో గణనాథుడి ఊరేగింపులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌లతో పాల్గొన్న గ్రామస్తులు


కురిచేడు : గణపతి గ్రామోత్సవంలో నృత్యం చేస్తున్న భక్తులు


పెద్దదోర్నాల : నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు


కొత్తపట్నం సముద్రంలో వినాయక నిమజ్జనం

మేతబీడు భూములను పరిశీలిస్తా..

సాక్షి ఎఫెక్ట్..

తర్లుపాడు: మండలంలోని మేతబీడు భూములను పరిశీలించి కబ్జా నుంచి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తర్లుపాడు తహసీల్దార్ జయవర్ధన్ తెలిపారు. మండలంలోని 200 ఎకరాల మేతబీడు భూములను కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు పన్నాగం పన్నడంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 4వ తేదీ 'మేతబీడు కొట్టేశారు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సోమవారం తహసీల్దార్ ఫోన్‌లో వివరణ ఇచ్చారు. సదరు భూములు తమ రికార్డుల్లో నిషేధిత భూముల జాబితా (22ఏ)లో ఉన్నట్లు తెలిపారు. వరద బాధితులకు సహాయక చర్యల్లో భాగంగా తాను విజయవాడలో విధులు నిర్వర్తిస్తున్నానని, తిరిగి వచ్చాక మరోసారి భూములను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ తెలిపారు.

టీడీపీ నేత భూ అక్రమాలపై విచారణ చేపట్టండి

● సబ్ కలెక్టర్‌కు రైతు సంఘ నాయకుడు ఫిర్యాదు

మార్కాపురం టౌన్: టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జున్ భూ అక్రమాలపై విచారణ జరపాలని రైతు సంఘ నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి సోమవారం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాథ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, జిల్లా ఎస్పీ, మార్కాపురం ఎమ్మెల్యేలకు కూడా తన ఫిర్యాదు పంపుతున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో కౌన్సిలర్‌గా ఉన్న మల్లికార్జున్.. అట్టడుగు వర్గాల వారికి చెందిన రాకాసిగడ్డ ప్రాంతంలో దళితులకు సంబంధించిన సుమారు 40 ఎకరాల పొలాన్ని అక్రమంగా రిజిస్టర్ చేయించుకుని ఆ భూమి తమదంటూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. మార్కాపురంలో పలు అపార్ట్‌మెంట్లను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినా మున్సిపాలిటీ వారు పట్టించుకోలేదని తెలిపారు. అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని, దళితుల భూములను వారికే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ తీగల చోరీ

కొండపి (సింగరాయకొండ): విద్యుత్ తీగలు చోరీకి గురైన సంఘటన కొండపి మండలంలోని మిట్టపాలెం, గోగినేనివారిపాలెం గ్రామాల మధ్య సోమవారం వెలుగుచూసింది. విద్యుత్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రెండు గ్రామాల మధ్య ఉన్న జగనన్న కాలనీకి వేసిన కొత్త విద్యుత్ లైను మరమ్మతులకు గురైంది. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిపూట తీగలను దొంగతనం చేశారు. సోమవారం తెల్లవారుజామున రైతులు పనుల నిమిత్తం వెళ్లే సమయంలో స్తంభాలకు విద్యుత్ తీగలు వేలాడటాన్ని గుర్తించి విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు పరిశీలించి దాదాపు 8 స్తంభాలకు చెందిన 11 కేవీ విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ విషయాన్ని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ కుంచాల కోటయ్యకు తెలియజేశారు. చోరీపై కొండపి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

యువతలో నైపుణ్యాలు వెలికితీయాలి


యువజనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:యువతలో దాగి ఉన్న కళలు, మేధో సంపత్తి, జీవన నైపుణ్యాలను వెలికితీయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి యువజనోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక ప్రకాశం భవనంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. సెప్టెంబర్ 20వ తేదీ యువతకు పలు రకాల పోటీలు నిర్వహిస్తారని, వైజ్ఞానిక, సాంస్కృతిక, జీవన నైపుణ్యాల్లో జరిగే ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో యువత పాల్గొనేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్యాంకు పైనుంచి పడి బెంగాల్ యువకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం గొట్టిపడియ-జమ్మనపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఇన్‌టెక్ వెల్ ట్యాంకు పైనుంచి ప్రమాదవశాత్తూ కిందపడి వెస్ట్‌బెంగాల్‌కు చెందిన రదియా పహన్ (26) మృతి చెందాడు. గత రెండేళ్ల నుంచి ప్రాజెక్టులో అతను పనిచేస్తున్నాడు. సోమవారం పనిచేస్తూ వాటర్ స్టోరేజీ ట్యాంకుపై నుంచి జారిపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా భార్యను మార్కాపురం రప్పించండి

● మస్కట్‌లో ఉన్న మగ్బుల్‌బీ భర్త ఖాదర్‌బాషా విజ్ఞప్తి


మీడియాతో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

మార్కాపురం: మస్కట్ వెళ్లి ఇబ్బందులు పడుతున్న తన భార్య మక్బుల్‌బీని మార్కాపురం రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె భర్త ఖాదర్‌బాషా విజ్ఞప్తి చేశారు. సోమవారం మార్కాపురంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన భార్య పని నిమిత్తం దుబాయ్ వెళ్తున్నానని చెప్పి మస్కట్ వెళ్లిందన్నారు. గత నెల 25న వెళ్లిన తన భార్య ఇప్పటివరకూ ఎలాంటి ఫోన్ చేయలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె మస్కట్‌లో పడుతున్న ఇబ్బందులను వీడియో ద్వారా తెలిపిందన్నారు. ఏజెంట్ల ద్వారా తాము మోసపోయామన్నారు. మంచి పని, మంచి జీతం ఆశ చూపడంతో ఆమె వెళ్లిందన్నారు. కానీ, అక్కడ ఇబ్బందులు పడుతోందని తెలిపారు. తన పిల్లలు మహమ్మద్, ఆయేషాలు తల్లి కోసం ఏడుస్తున్నారని, ప్రభుత్వం స్పందించి తన భార్యను మస్కట్ నుంచి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వినాయకచవితి మండపం వద్ద అపశ్రుతి

● మండపానికి కట్టిన తాడు తగిలి ప్రమాదానికి గురై యువకుడి మృతి


సందీప్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: వినాయకచవితి మండపం వద్ద అపశ్రుతి జరిగింది. మండపానికి కట్టిన తాడు తగిలి బైకు ప్రమాదానికి గురై ఓ యువకుడి మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు నగరంలోని పేర్నమిట్టలో సోమవారం చోటుచేసుకుంది. పేర్నమిట్ట ఇందిరానగర్‌కు చెందిన బుట్టి విష్ణుకు ఇద్దరు సంతానం. కుమారుడు బుట్టి సందీప్ (19) ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. సోమవారం మంచినీటి బబుల్ తీసుకుని ఇంటి నుంచి మోటారు బైకు మీద బయలుదేరాడు. వినాయకచవితి పండుగ సందర్భంగా మాదాసు బజారు వద్ద మండపం ఏర్పాటు చేసి ఉంది. మండపానికి సపోర్టుగా తాడు కట్టి ఉన్నారు. ఆ తాడు చూసుకోకుండా అటుగా వెళ్లిన సందీప్ మెడకు తాడు తగిలి వెళ్లకిలా కిందపడ్డాడు. తీవ్రగాయాలవడంతో సమీపంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా.. అప్పటికే మరణించినట్లు వైద్యుడు తెలిపారు. ఊహించని ఈ పరిణామంతో సందీప్ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఈ ఘటనతో ఇందిరానగర్‌లో విషాదం అలముకుంది.

గణేష్ నిమజ్జనంలో ఘర్షణ

● పథకం ప్రకారం వైఎస్సార్ సీపీ వర్గీయులపై రాళ్లు రువ్విన టీడీపీ వర్గీయులు
● ఐదుగురికి గాయాలు

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామంలో సోమవారం రాత్రి గణేశ నిమజ్జనంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీ వర్గీయులు పథకం ప్రకారం వైఎస్సార్ సీపీ వర్గీయులపై రాళ్ల దాడి చేయడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. సోమవారం రాత్రి టీడీపీ వర్గీయుల గణేష్ నిమజ్జనం జరుగుతుండగా, పొలం పనులు ముగించుకుని ట్రాక్టర్‌తో కటకం రామయ్య ఇంటికి వస్తున్నాడు. మధ్యలో గణేష్ నిమజ్జన కార్యక్రమం జరుగుతుండటంతో తన ట్రాక్టర్‌ను పక్కన పెట్టుకుని ఉన్నాడు. గ్రామంలోని వైఎస్సార్ సీపీ వర్గీయుల విగ్రహ నిమజ్జనం బుధవారం జరగనుంది. దానిని అడ్డుకునే ప్రణాళికలో భాగంగా రామయ్య తమను తిట్టినట్లుగా సృష్టించి టీడీపీ వర్గీయులు గొడవకు దిగారు. ఏకంగా ఇళ్లపైకి ఎక్కి వైఎస్సార్ సీపీ వర్గీయుల ఇళ్లపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో అన్నెం సుబ్బారెడ్డి, మార్తల రమణారెడ్డి, కటకం వెంకటరత్నం, తాటిమట్ల కృష్ణ, ఉట్టి చిన్న వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ సూరేపల్లి సుబ్బారావు తన సిబ్బందితో గ్రామానికి వెళ్లి పరిస్థితిని అదుపు చేశారు. క్షతగాత్రులను దర్శి వైద్యశాలకు తరలించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

నిమజ్జనానికి వెళ్తూ వ్యక్తి దుర్మరణం

● బస్సు వెనుక టైరు కింద పడి మృతి

సింగరాయకొండ: బుల్లెట్‌పై వినాయక నిమజ్జనానికి వెళ్తూ బస్సు వెనుక చక్రాల కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి సింగరాయకొండ మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జీవీఆర్ ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పూనం మీనాశేఖర రెడ్డి (51) వినాయకచవితిని పురస్కరించుకుని తన కంపెనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనానికి బుల్లెట్‌పై వెళ్తున్నాడు. కందుకూరు రోడ్డు సమీపంలో విగ్రహాన్ని దాటి ముందు వెళ్తున్న నెల్లూరు - విజయవాడ ఆర్టీసీ బస్సును క్రాస్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ రోడ్డు మార్జిన్లో ఉన్న గుంతలోకి బుల్లెట్ వెళ్లింది. దీంతో అదుపుతప్పి పడిపోయాడు. పక్కనే వెళ్తున్న బస్సు వెనుక టైర్ కింద మీనాశేఖరరెడ్డి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఒంగోలులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని ఎస్సై బి.మహేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు చెప్పారు. శేఖర్‌రెడ్డికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కంట్లో కారం కొట్టి కర్రలతో దాడి

● జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్‌కు గాయాలు
● కార్యాలయ సిబ్బందిపైనే అనుమానాలు

ఒంగోలు టౌన్: జిల్లా కో ఆపరేటివ్ కార్యాలయంలో ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పోలిశెట్టి రాజశేఖర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. కళ్లలో కారం చల్లి కర్రలతో కొట్టారు. తన కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందే తన మీద దాడి చేయించారని ఆయన అనుమానాలు వ్యక్తం చేయడం కలకలం సృష్టిస్తోంది. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని అంబేడ్కర్ భవనం సమీపంలోని ఇందిరా నగర్‌లో రాజశేఖర్ నివాసం ఉంటున్నారు. పెండింగ్ వర్క్ వుండటంతో ఆదివారం ఉదయం ప్రకాశం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న కార్యాలయానికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. అంబేడ్కర్ భవనం రోడ్డులోని సచివాలయం వద్దకు రాగానే.. గుర్తు తెలియని వ్యక్తి ఒకరు ఎదురుగా వచ్చి అడ్డుకున్నాడు. కళ్లలో కారం కొట్టాడు. తప్పించుకునే ప్రయత్నంలో ఉండగా మరో వ్యక్తి వెనుక నుంచి వచ్చి రెండు చేతులను కదలకుండా పట్టుకున్నాడు. కర్రలతో ఇష్టమొచ్చినట్లు కొట్టడం మొదలుపెట్టారు. దెబ్బలు తాళలేక గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వినాయకుడి మండపంలో ఉన్న జనం రావడంతో వదిలేసి పారిపోయారు. అంతలోనే అక్కడకు కార్యాలయం అటెండర్ షేక్ నవాజ్ రావడంతో అతడి సహాయంతో జీజీహెచ్‌లో రాజశేఖర్ చేరారు. తమ శాఖలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ రామన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు ఉదయ కిరణ్, అశోక్‌కుమార్, అటెండర్ పి.స్వర్ణలు తన మీద ద్వేషంతో దాడి చేయించారని తనకు అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రాజశేఖర్ పేర్కొన్నారు. వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి


మృతిచెందిన అబ్రహం

కంభం: కూరగాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొని సైకిల్‌పై వెళ్తున్న సెక్యూరిటీ గార్డు మృతిచెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం అనంతపురం-అమరావతి జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బేస్తవారిపేట మండలం గొట్టిమిల్లు గ్రామానికి చెందిన గొట్టం అబ్రహం (59) బ్యాంకులో విధులకు వెళ్లేందుకు మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటి వద్ద నుంచి బయలుదేరాడు. బ్యాంక్ సమీపంలోనే హైవేపై వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబ్రహం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గడిచిన నాలుగు రోజుల్లో నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి


మృతిచెందిన కోయి బ్రహ్మం (ఫైల్)

ముండ్లమూరు (దర్శి): ఈతకు వెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన ముండ్లమూరు మండలంలోని ఈదర వాగులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కోయి బ్రహ్మం (23) ఇద్దరు స్నేహితులతో కలిసి ఈదర వాగులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ గోతిలో పడి నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. ముగ్గురికీ సరిగా ఈత రాకపోవడంతో తక్కువ లోతులోనే ఈత కొడుతున్నారు. అనుకోకుండా బ్రహ్మం గోతి వైపు వెళ్లి చిక్కుకుని మృతి చెందాడు. స్నేహితుడు కళ్ల ముందే ప్రాణం వదులుతున్నా కాపాడుకోలేక పోయామంటూ మిగిలిన ఇద్దరూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు తెలుసుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కోయి అంజయ్య, అన్నపూర్ణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, బ్రహ్మం పెద్ద కుమారుడు. పదో తరగతి వరకు చదివి గ్రామంలోనే కరెంటు పని చేస్తున్నాడు. చేతికంది వచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు.

బైక్ పైనుంచి పడి యువకుడు మృతి

హనుమంతునిపాడు: బైక్ పైనుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన హనుమంతునిపాడు మండల పరిధిలోని వేములపాడు ఎస్సీకాలనీ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. వేములపాడు ఎస్సీకాలనీకి చెందిన జుటిక పురుషోత్తం కుమారుడు జుటిక చందు (18) అదే గ్రామానికి చెందిన పిడతల జపానుతో కలిసి బైకుపై కనిగిరి నుంచి స్వగ్రామం వస్తున్నాడు. గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బైకుకు కుక్క అడ్డం వచ్చింది. బైకు తోలుతున్న పిడతల జపాను సడన్‌గా బ్రేక్ కొట్టడంతో వెనుక కూర్చున్న జుటిక చందు ఎగిరి రోడ్డుపై వెనుకకు పడ్డాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

డిసెంబర్ 8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను డిసెంబర్ 8వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ పేలి రూ.2 లక్షల ఆస్తినష్టం


సిలిండర్ పేలిన ఇల్లు

కొనకనమిట్ల: ప్రమాదవశాత్తూ ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. కొనకనమిట్ల మండలంలోని కాట్రగుంట పంచాయతీ ఓబులరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దుగ్గిరెడ్డి కొండారెడ్డి ఇంట్లో ఉన్న సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న కొండారెడ్డి భయంతో బయటకు పరుగులు తీశాడు. కొంతసేపటికి గ్యాస్ సిలిండర్ పెద్దశబ్దంతో పేలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లో ఉన్న రూ.50 వేల విలువ చేసే టీవీ, కరెంటు మీటర్, ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు కొండారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. సిలిండర్ పేలిన సమాచారంతో గ్యాస్ కంపెనీ వారు, వీఆర్‌ఓ రమేష్ వచ్చి కొండారెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని వీఆర్‌ఓ తెలిపారు.